కామెడీ కథ

# క్లినిక్ 3000

**సడన్ బ్రేక్‌తో ఆటో ఆగింది. నొప్పులు మొదలైన నిండు గర్భిణిలా అటూ-ఇటూ ఊగుతూ, ముక్కుతూ, మూలుగుతూ ఓ నిమిషం పాటు నానా పాట్లు పడింది. ఆ తర్వాత సుఖప్రసవం అయినట్టు బేబీ ఆటోలా ఉన్న ఓ శాల్తీ, వెనక సీట్లోంచి బైటికి దొర్లిపడింది. క్షేమంగా పురుడు పోసిన మంత్రసానిలా, ఆటో డ్రైవర్ తృప్తిగా నిట్టూర్చాడు.**

గణపతి బోర్డు వంక చూసాడు. 'క్లినిక్ 3000' దాని కింద 'ఏనుగులా రండి-పీనుగులా పొండి' అని రాసి ఉంది. బిక్కు-బిక్కు మంటూనే గణపతి గేటు తీసుకుని లోపలికి అడుగు పెట్టాడు.

రిసెప్షన్‌లో ఉన్న యువతిని ఓసారి చూసి, సిగ్గుతో తలొంచుకుని నిలబడ్డాడు. ఆమెకి గణపతి సైజు బాడీలను చూసిన అనుభవం ఉంది. "ఈ ఫాం నింపి పక్క గదిలోకి వెళ్ళండి" అని టెలిఫోన్ డైరెక్టరీ సైజులో ఉన్న ఓ ఫారాన్ని గణపతికి ఇచ్చి 'లావెక్కడం ఎలా?' అనే పుస్తకం చదువుకోసాగింది.

గణపతి రెండు గంటల పాటు చాలా కష్టపడి ఆ ఫాం నింపి, తను అమ్మ కడుపులోపడ్డప్పటి నుంచి, ఆ క్షణం వరకూ తన జీవిత విశేషాల్ని పొందుపర్చిన, ఆ మహత్తర ఉద్గ్రంధాన్ని తీసుకుని పక్క గదిలోకి వెళ్ళాడు.

"హైట్ చూడాలి.." పొట్లకాయలా ఉన్న ఓ శాల్తీ చాలా అనాసక్తిగా అంది.

"చూస్కోండి!" గణపతి వరమిస్తున్నట్టు అన్నాడు.

గణపతిని ఓ చెక్క స్టాండ్‌కి ఆనుకుని నిలబడి మని చెప్పి, ఆ వ్యక్తి కసిదీరా, గణపతి తలపైన వేలాడుతున్న స్కేల్ లాంటి బరువైన చెక్కముక్కని వొదిలాడు. అది సర్రున కిందికి దూసుకు వచ్చి, ఠపీమని గణపతి మాడు అదరగొట్టింది. గణపతి కళ్ళు బైర్లు కమ్మాయి. పొట్లకాయ వెంటనే "ఐదూ..ఆరు.." అని అరిచాడు.

గణపతి "ఏడు..ఎనిమిది.." అని మగతగా అన్నాడు.

"నేను చెప్పింది..మీ హైటు..." అని గణపతిని ఓ వెయింగ్ మెషీన్ వైపు తీసుకెళ్ళాడు.

గణపతి సందేహిస్తూనే మిషను ఎక్కాడు. అంతే! పొంగిన పూరిలా ఉన్నది కాస్తా రోడ్డు రోలర్ కింద పడిన అప్పడంలా నేలకి అంటుకుపోయింది. లోపలి ముల్లు..కాసేపు అటూ..ఇటూ అల్లాడి ఠపీమని విరిగిపోయి, ఆత్మాహుతి చేసుకుంది.

మొదటిసారి పొట్లకాయ మొహంలో కించిత్తు ఆసక్తి, రవ్వంత భయం లాంటివి కనిపించాయి. తర్వాత గణపతిని బియ్యం బస్తాలు గట్రా తూచే ఓ పెద్ద మిషను దగ్గరికి తీసుకెళ్ళి, గున్న ఏనుగుని సర్కస్‌లో స్టూల్ మీదికి ఎక్కించినట్టు, ఎలాగో ఎక్కించి "నూటా అరవై ఆరు" అని వొగరుస్తూ నిలబడిపోయాడు పొట్లకాయ.

ఆ తర్వాత గణపతి వివిధ అవయవాల కొలతలు తీసుకోవడం మొదలైంది. అతి కష్టం మీద అన్నీ ముగించారు. ఇక నడుం, పొత్తికడుపు మిగిలిపోయాయి. పొట్లకాయ గణపతి నడుం చుట్టూ ఓ టేప్ విసిరేసాడు. అది అతవలి వైపు రాక, వొచ్చినా, మరో చేత్తో అది పట్టుకోలేక, ఆ తతంగం కొద్దిసేపు సాగింది. ఆ తర్వాత పొట్లకాయ మరో ఉపాయం ఆలోచించాడు.

రెండు టేప్‌లు ముడేసి ఒక కొన గణపతిని తన బొడ్డు దగ్గర పట్టుకోమని చెప్పి, రెండో కొన తను తీసుకుని, గుడి చుట్టు ప్రదక్షణలు చేస్తున్న భక్తుడిలా గణపతి చుట్టూ తిరిగి వచ్చి, మరో కొన కూడా బొడ్డు దగ్గరకి చేర్చి, "డెబ్బై ఆరు" అని అరిచి, నుదుటి మీద పట్టిన చెమట విదిల్చాడు పొట్లకాయ.

చిట్టెలుకని తరుముతున్న వినాయకుడిలా, తను ముందూ వెనుక గణపతి నడుస్తుండగా, ఓ గది ముందు ఆగి, తాళం తీసాడు పొట్లకాయ.

"ఇదే మీ గది" అంటూ తాళం చెవి గణపతికి యిచ్చి వెళ్ళిపోయాడు. రూం వసతిగానే కనిపించింది. పావు గంట తర్వాత పోత్రంలా ఉన్న ఓ ఆవిడ రెండు కూజాలు లోపల పెట్టింది.

"రోజూ ఈ రెండు కూజాల నీళ్ళు తాగాలి. చుక్క కూడా మిగలకూడదు" ఆర్డర్ జారీ చేసి విస విసా వెళ్ళిపోయింది.

మర్నాడు పొద్దున్నే ఎవరో తలుపు తట్టిన చప్పుడికి మెళకువ వచ్చి, వెళ్ళి విసుగ్గా తలుపు తీసాడు.

మరో గంట తర్వాత, పొట్లకాయ వచ్చి గణపతిని ఓ మైదానం లాంటి ప్రదేశానికి తీసుకెళ్ళాడు.

"మీకు జాగింగ్ అలవాటుందా?" విసుగ్గా అడిగాడు పొట్లకాయ.

"అబ్బే..కనీసం వాకింగ్ కూడా అలవాటు లేదు!" గర్వంగా చెప్పాడు గణపతి చుట్టూ చూస్తూ.

"మరేం ఫరవాలేదు. అదే వస్తుంది" అని ఓ క్షణం ఆగి, "రాణీ! వాణీ!" అని పిలిచాడు.

"అయ్యో..లేడీస్‌తో వాకింగా? నాకు సిగ్గండి" అంటూనే కొయ్యబారిపోయాడు గణపతి. కారణం-రాణి, వాణిలు, దాదాపు పెద్ద పులి సైజులో వున్న వేటకుక్కలు!

మరుక్షణం గణపతి ప్రాణభీతితో పరిగెత్తడం, కుక్కలు అతన్ని వెంటబడడం రెప్పపాటులో జరిగింది. ఎప్పుడూ అరడజను అడుగులు కూడా నడవడానికి అసహ్యించుకునే గణపతి, ఏకబిగిన అరగంటపాటు మదగజంలా మైదానం అంతా పరుగెత్తి, అలిసిపోయి కుప్పకూలిపోయాడు.

వాణి, రాణీ ఆబగా, అతని తొడ ఒకటి, మెడని మరొకటి అందుకోబోతుండగా ఓ విజిల్ వినబడింది. మంత్రం వేసినట్టు అవి ఆగిపోయాయి.

మధ్యాహ్నం రెండింటికి, మళ్ళీ పొట్లకాయ వచ్చాడు. అతన్ని చూడగానే సన్నటి వొణుకు మొదలైంది గణపతికి.

"బట్టలు విప్పండి..అండర్‌వేర్ వుంచుకోవచ్చు" దయ తలుస్తున్నట్టు అన్నాడు పొట్లకాయ. గణపతి కొద్దిగా సిగ్గుపడుతూ ఆ పని చేసాడు. మరుక్షణం, పొట్లకాయ రెండు పెద్ద వేపమండల్లాంటివి తీసి కాసేపు గణపతి వొళ్ళంతా సుతారంగా నిమరసాగాడు. గణపతికి చాలా హాయిగా..సుఖంగా అనిపించింది. నిద్రలాంటిది కూడా రాసాగింది. రెండు నిమిషాలు గడిచాయి..అంతే! అకస్మాత్తుగా వొళ్ళంతా ఒకటే దురద..చర్మం తొలిచేసుకుందామనుకునేంత దురద..గోకుడు...మొదలైంది. గణపతి పావు గంట పాటు క్రింద పొర్లీ..ముందుకీ వెనక్కీ పొంగి...అష్ట వంకర్లు తిరుగుతూ వొళ్ళంతా ఎర్రగా కందిపోయేలా గీరుకోసాగాడు. అతనికి ఏడుపు రాసాగింది. పొట్లకాయ జాలిపడి..ఏదో సున్నంలాంటి పౌడర్ తీసి, గణపతి మీద జల్లాడు. దురద తగ్గిపోయింది. మిరపతోటలో పెట్టే పిడతలా ఉన్నాడు గణపతి ఆ క్షణంలో. కళ్ళు తుడుచుకుంటూ బాత్‌రూంలోకి వెళ్ళాడు.

వారం రోజులు గడిచాయి.

గణపతి ఇంకా ఉపవాసాలు చేస్తూనే ఉన్నాడు. అక్కడి వాతావరణం కొద్ది కొద్దిగా అలవాటవుతున్నా...ఏ క్షణం ఏం కొంపమునుగుతుందోనని బిక్కు బిక్కుమంటూనే కాలం గడుపుతున్నాడు.


ఆ రోజు, తారుడబ్బాలాంటి ఓ వ్యక్తి వచ్చి గణపతిని తన కూడా తీసుకెళ్ళాడు. ఓ పెద్ద దిగుడు బావి దగ్గర ఆగాడు. "మీకు ఈతవచ్చా?" అని కోపంగా అడిగింది తారుడబ్బా.

"రాదు..నాకు..నీటి గండం ఉందని చిన్నప్పుడు..." గణపతి అప్పటికే గాలిలో తేలుతూ వెళ్ళి బావిలో చిన్న సైజు కొండలా పడ్డాడు. ఓ నిమిషం వరకూ పైకి తేల

**మొర్తల ప్రభాకర్ రెడ్డి**

లేదు. తారుడబ్బా సంతోషంతో చప్పట్లు కొట్టబోతుండగా గణపతి, కొత్తరకం తిమింగలంలా పైకి తేలాడు. ప్రాణభీతితో కాళ్ళూ, చేతులూ ఆడిస్తూ మునిగిపోకుండా నానా తంటాలు పడ్డాడు. గంట గడిచేసరికి, అతను దాదాపు గజ ఈతగాడుగా మారాడు. ఏషియన్ గేమ్స్‌కి అతన్ని భారతదేశం ప్రతినిధిగా పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేసేందుకు క్లినిక్ 3000 యాజమాన్యం సిద్ధమైంది. మొదటిసారిగా గణపతికి కాస్త సంతోషంగా అనిపించింది.

అయితే అది ఎంతోసేపు నిలువలేదు.



మధ్యాహ్నం మూడింటికి, గణపతిని ఓ తోటలోకి తీసుకెళ్ళారు. అక్కడ కొంతమంది పనివాళ్ళు గుట్టలుగా ఉన్న బంకమట్టిని పొడి చేసి..ఓ హౌజ్‌లో వున్న నీళ్ళలో కలుపుతున్నారు. మరికొందరు విడిగా..కొన్ని తట్టల్లో మట్టిని కలుపుతున్నారు. అప్పటికే కొందరు పేషెంట్స్..అన్ని రకాల సైజుల్లో ఉన్నవారు అక్కడ అండర్ వేర్ల మీద నిలబడి వున్నారు. మట్టిపూత పూయడం మొదలైంది. గణపతి వంతు వచ్చేసరికి, అందరికీ నీరసం వచ్చేసింది. గణపతి ఆకారం చూసి వాళ్ళు మరింత డీలా పడ్డారు. తారుడబ్బా..మిగతా వాళ్ళ చెవిలో ఏదో చెప్పింది. అంతే...అందరూ చెవుల దాకా నవ్వుతూ గణపతిని అమాంతం కాళ్ళూ, చేతులు పట్టుకుని పైకి లేపి, ఉయ్యాలా..జంపాలా అని నాలుగుసార్లు అరిచి, మట్టి నీళ్ళ హౌస్‌లోకి విసిరేసారు. గణపతి "వాయ్యో!" అని అరుస్తూ హౌస్ అడుగు భాగానికి ప్రయాణం చేసి, ఇంకా ఆయుష్షు ఉండటంతో ఎలాగో మళ్ళీ పైకి తేలాడు.

"అబ్బే లాంభం లేదు మట్టి అంతగా అంటుకోలేదు" అని పొట్లకాయ తీర్మానించాడు.

ఈసారి గణపతిని ఓ స్తంభానికి కట్టేసి, మట్టిముద్దల్ని తీసుకుని, పిడకల్లా గణపతి వొంటి నిండా కొట్టారు. తొండం తెగిన గున్న ఏనుగులా ఉన్న గణపతిని చూడ్డానికి జనం ఎగబడ్డారు. ఆ తర్వాత గణపతి వొంటి మీద మట్టి కడిగేయడానికి, ఫైరింజన్ గొట్టాల్లాంటి వాటిని తెచ్చి, బోరింగ్ పంప్‌కి కనెక్షన్ క్లిప్పి, దాదాపు రెండు ట్యాంకర్ల నీళ్ళు ఖర్చు చేసి, గణపతికి మళ్ళీ మానవ రూపం ప్రసాదించారు.

వారం రోజుల ఉపవాసం తర్వాత డాక్టర్ ఓ రోజు గణపతిని చిరాగ్గా చూస్తూ "ఈ రోజు నించీ నీకు పచ్చి కూరగాయలు ఇవ్వమన్నారు బాస్. నాకే అధికారం వుంటే ఉపవాసమే మరో ఆరు నెలలు పొడిగించేవాడిని" అన్నాడు.

గణపతికి చిర్రెత్తుకొచ్చింది 'మనది కాకపోతే ఢిల్లీ దాకా దేకమన్నాడట..వీడి సొమ్మేం పోయింది?' ఆ డాక్టర్‌ని తినేసి నరమాంస భక్షకుడిలా మారిపోదామని ఓ క్షణం అనిపించినా ఎలాగో తమాయించుకున్నాడు గణపతి.

మరో రెండు గంటల తర్వాత అటెండర్ వచ్చి ఓ చిన్న ప్లాస్టిక్ బుట్ట గణపతికి ఇచ్చి వెళ్ళాడు. అందులో ఒక బీట్‌రూట్ ముక్క ఓ టమాటా..రెండు క్యారెట్ ముక్కలూ..వున్నాయి. గణపతి గుక్కపెట్టి చాలాసేపు ఏడ్చాడు. తనకన్నా దురదృష్టవంతుడు ప్రపంచంలో ఎవ్వరూ ఉండరని అనిపించింది. ఇంతకన్నా ఘోరం అన్యాయం మరొకటి ఉండదని తీర్మానించాడు గణపతి. పగవాడికి కూడా అలాంటి పాట్లు రాకూడదని మనస్ఫూర్తిగా కోరుకున్నాడు.

పక్క రూంలోంచి ఏదో కోలాహలం వినిపించింది. గణపతి వెళ్ళేసరికి..ఓ వ్యక్తి డాక్టర్‌తో ఘర్షణ పడుతున్నాడు.

"ఏవిటి సార్..ఈ అన్యాయం. మూడు పుల్కాలు అని రాసి వున్నా..నాకు రెండే తెచ్చాడు మీ అటెండర్..ఇంతకన్నా మోసం మరొకటుంటుందా?" అని వాదిస్తున్నాడు.

"లేదు సార్..నేను ఖచ్చితంగా మూడు పుల్కాలు తెచ్చానండి. ఈయన తిని కూడా.." అని అటెండర్ వాదిస్తున్నాడు. డాక్టర్ అటెండర్‌ని పంపించేసి..పేషంట్‌తో ఏదో గుసగుసలుగా అన్నాడు. మరుక్షణం ఆ వ్యక్తి డాక్టర్ కాళ్ళ మీదపడి "సార్ అంత మాటనకండి. వాడు చెప్పింది నిజమే. మూడు పుల్కాలు ఏ మూలకి సార్..పెద్దమనసుతో ఐదు అయినా పంపే ఏర్పాటు చెయ్యండి. నా చర్మంతో మీకు.." అంటూ యింకా

ఏమేమి చేసే ఉద్దేశ్యం వుందో, ఎలెక్షన్ మ్యానిఫెస్టో లాంటిదొకటి చదవసాగాడు.

డాక్టర్ ఎలాగో బైటపడ్డాడు. "ఏం చెప్పారు సార్..అతనికి, అంతగా భయపడ్డాడు?" ఆసక్తిగా ప్రశ్నించాడు గణపతి.

"ఓ మీరు కొత్తగదూ..ఏముంది నిజం చెప్పకపోతే మూడు పూటలా కాకరకాయ సూప్ యిప్పిస్తానన్నాను" డాక్టర్ నవ్వుతూ చెప్పాడు.

నాలుగు రోజులు పచ్చికూరల ప్రహసనం తర్వాత, గణపతికి రెండు పుల్కాలు శాంక్షన్ అయ్యాయి. గణపతి ఆ మాత్రానికే..ఫైవ్ స్టార్ హోటల్లో బిర్యానీ తింటున్నంత సంబరపడ్డాడు.

ఆ రోజు తారుడబ్బా గణపతిని మసాజ్ రూంకి తీసుకెళ్ళాడు. అక్కడ వస్తాదులను చూసి గణపతి ఖంగుతిన్నాడు. వాళ్ళు పలకరింపుగా నవ్వి.."రండి..టేబిల్ మీద పడుకోండి" అని ప్రేమగా ఆహ్వానించారు. గణపతి బెరుకుగానే టేబిల్ ఎక్కాడు. ఒక వస్తాదు ఓ పాత బక్కెట్‌లో ఉన్న ఆముదం లాంటి ద్రవాన్ని, అంగుళం కూడా వొదలకుండా, గణపతి మీద కళ్ళాపిలా చల్లాడు. ఆ ఎఫెక్ట్ సరిపోదనుకున్నాడో ఏమో..మరో బకెట్ ఆముదాన్ని, గణపతి మీద కుమ్మరించాడు. ఆ తర్వాత వస్తాదులిద్దరూ..పాత తాటిమట్ట లాంటివి తీసుకుని, ఆముదం సమానంగా అన్ని భాగాలకూ 'ప్రాంతాలకూ' అంటుకునేట్టు అలికారు. గణపతికి కాస్త ధైర్యం వచ్చింది. అంతే! మరుక్షణం వస్తాదులిద్దరూ రెండు పెద్ద రబ్బరు గొట్టాలు అందుకుని..వాటితే గణపతి వొళ్ళు వాయగొట్టసాగారు. గణపతి అరుపులు వాళ్ళు వినిపించుకునే స్థితిలో లేరు. శ్రమ తెలియకుండా ఉండాలని కాబోలు..శరభ! శరభ! అని పూనకం వచ్చినట్టు అరుస్తూ..గణపతిని 'ఖైమా' కింద కొట్టారు. ఆ తర్వాత బోర్లా తిరగేసి, మరో పావుగంట పాటు, 'పాతపరుపు దుమ్ము దులిపే' ప్రోగ్రాం కంటిన్యూ చేసారు.

గణపతిని, మోసుకెళ్ళి మొరటుగా అతని గదిలో మంచం మీద పారేసి, మరో శాల్తీని పచ్చడి చెయ్యడానికి వెళ్ళిపోయారు.

నెలరోజులు గడిచాయి. గణపతి ఏదో కాస్త చిక్కినట్టు కనిపిస్తున్నాడు కానీ...పెద్ద చెప్పుకోదగ్గ మార్పేమీ లేదు. ఆ మాటే డాక్టర్ కూడా అన్నాడు.

ఆ రోజు ప్రొద్దుటే ట్రీట్‌మెంట్ సెంటర్‌కి వెళ్ళాడు గణపతి. గణపతిని ఓ చెక్క పెట్టెలో కూర్చోమన్నారు. తల మాత్రం బైట పెట్టమన్నారు. పూర్వకాలంలో నేరస్థుల్ని కొరత వేసేవారని విన్నాడు. బహుశా అది..ఇదేనేమో అనిపించింది గణపతికి. లోపల చాలా ఇరుకుగా ఉంది. గణపతికి చాలా యిబ్బందిగా అనిపించింది. ఇంతలో తారుడబ్బా వచ్చి..స్టీమ్ ఆన్ చేసి వెళ్ళాడు. నాలుగు ఐదు నిమిషాలు గడిచేసరికి..గణపతికి కష్టాలు మొదలయ్యాయి.

అంతకంతకూ చెక్క పెట్టెలో వేడి ఎక్కువవసాగింది. ఎటూ కదలలేని, బైటికి రాలేని స్థితి. లోపల ఆవిర్లు, చర్మాన్ని కోస్తున్న ఫీలింగ్. గణపతి ఏనుగు ఘీంకారాలు మొదలెట్టాడు. అదృష్టవశాత్తు అటుగా వెళుతున్న పొట్లకాయ ఆ ఆర్తనాదాలు విని తాపీగా లోపలికొచ్చాడు. గణపతిని చూసి "ఓ మీరా ఎందుకు అలా అరుస్తారు?" అన్నాడు చిరాగ్గా. గణపతి ఏదో అనేంతలో తారుడబ్బా గదిలోకి వచ్చాడు.

"అవునూ..టెంపరేచర్..ఎంతకి సెట్ చేసావురా?" అడిగాడు పొట్లకాయ "నూటపది డిగ్రీలు..ఏం తప్పా?" అన్నాడు తారుడబ్బా సమర్థింపుగా.

"ఈయన బాడీకి..అది చాలదు. కనీసం..నూటాముప్ఫై అయినా ఉంటేగానీ ఆ కొవ్వు కరగదు..వేడి పెంచు" అని ఆర్డర్ జారీ చేసాడు పొట్లకాయ.

"బాబూ..నా వల్ల కాదు. నన్ను బయటకి.." గణపతి వెక్కి వెక్కి ఏడుస్తూ చెబుతున్న దాన్ని వాళ్ళు వినిపించుకునే స్థితిలో లేరు.

తారుడబ్బా అహం దెబ్బతిని.."అబ్బే..అదేం కాదు. నూట పది డిగ్రీలే కరెక్టు" అని వాదనకు దిగాడు. ఇద్దరూ..నూటాముప్ఫై..నూటా పది అని ఆవేశంగా అరుచుకోసాగారు.

గణపతి ఆఖరి ప్రయత్నంగా-"అయ్యలారా గొడవెందుకు..మధ్యేమార్గంగా నూటా ఇరవై డిగ్రీలుగా తీర్మానం చెయ్యండి" అని కమిలిపోయిన తొడల్ని రుద్దుకుంటూ అరిచాడు.

ఓసారి గణపతి వైపు ఆరాధనగా చూసి..ఇద్దరూ రాజీపడ్డారు. ఇక తన బాధలకి తెరపడిందని గణపతి భావిస్తుండగా, అకస్మాత్తుగా పొట్లకాయ "అది సరే..ఇంతకీ ఎన్ని నిమిషాలకి సెట్ చేసావు?" అని మరో సందేహం వెలిబుచ్చాడు.

"ఇరవై నిమిషాలకి!" తాపీగా జవాబిచ్చాడు తారుడబ్బా. "భలేవాడివే..ఈయనికి కనీసం నలభై నిమిషాలైతే గానీ.." అని మళ్ళీ వాదనకి దిగాడు పొట్లకాయ.

ఇరవై..నలభై అని మరో పేచి మొదలైంది వాళ్ళిద్దరి మధ్య.

గణపతి వొళ్ళంతా ఎర్రగా కందిపోయి, సగం ఫారిన ర్లా తయారయ్యాడు. కొందరు అది బొల్లి అని అనుకునే అవకాశం కూడా ఉంది.

"మహానుభావులారా..పెద్ద మనసుతో నేను చెప్పేది మన్నించండి. ఈసారికి ముప్ఫై నిమిషాలకి సెటిల్ చేసుకుని నాకు ప్రాణభిక్ష పెట్టండి" అని గణపతి స్పృహ తప్పాడు.

రెండు రోజుల తర్వాత గణపతి దగ్గరికి ఓ డాక్టర్ వచ్చి "ఏమిటి మీరు చేస్తున్నది. మీ కోపరేషన్ లేకపోతే, మేమేమీ చెయ్యలేం..రోజూ యోగా క్లాస్ కెళ్ళి, అరగంట శవాసనం మాత్రమే వేస్తున్నారట. ఆ ఆసనంలోనే నిద్రపోతున్నారుట. ఇలా అయితే..ఇక మీరు బరువు తగ్గడం కల్ల. ఇక లాభం లేదు. ఆఖరి ప్రయత్నంగా హిప్నోథెరపీ..చేయాలి. పదండి" అన్నాడు. కసాయి వెంట మేకలా గణపతి బయలుదేరాడు.

"వీరు ప్రొఫెసర్ దైవసహాయం. వీరు మీకు తప్పక సహాయం చేస్తారు. గుడ్‌లక్" అని డాక్టర్ వెళ్ళిపోయాడు.

అరగంట నానా అవస్థలు పడి..ఓ మైదానంలోకి తీసుకెళ్ళి మొత్తానికి గణపతిని హిప్నటైజ్ చేయగలిగాడు దైవసహాయం. "మీరు..లాంగ్ డిస్టెన్స్ రన్నర్..మీరిప్పుడు ఒలెంపిక్స్ పోటీలో భారతదేశం తరుపున పాల్గొంటున్నారు. దేశ ప్రజల ఆశలన్నీ మీమీదే ఉన్నాయి. మీరు తప్పకుండా గోల్డ్‌మెడల్ సంపాదిస్తారు. కమాన్..రన్..రన్" అని సజెషన్ ఇచ్చాడు దైవసహాయం.

అకస్మాత్తుగా బైట కోలాహలం..అరుపులూ..ఓ అటెండర్ వచ్చి.."పదండి సార్..మనవాళ్ళు స్ట్రయిక్ చేస్తున్నారు..అందరూ వెయిట్ చేస్తున్నారు" అంటూ దైవసహాయాన్ని తనతో లాక్కెళ్ళాడు.

అలా మొదలైన స్ట్రయిక్..వారం రోజులు కొనసాగింది. అందరూ గణపతి గురించి మరిచిపోయారు. మేనేజ్‌మెంట్‌తో ఒప్పందం కుదిరాక..స్టాఫ్ విధులకు హాజరయ్యారు. దైవసహాయం..వచ్చి చూసే సరికి..పరిగెత్తి..పరిగెత్తి..ఎముకల పోగులా అయిపోయాడు గణపతి. అతని అండర్‌వేర్ జారి కాళ్ళకి అడ్డుపడుతోంది. అయినా ఎలాగో గణపతి అడుగులు వేస్తూనే ఉన్నాడు. దైవసహాయం అతన్ని ట్రాన్స్ లోంచి బైటికి తెచ్చాడు.




మర్నాడు..

ఇద్దరు అటెండర్లు..అతన్ని స్ట్రెచర్ మీద గేటు బైటికి మోసుకొచ్చారు. ఆటోని పిలిచారు. ఎక్కడికి వెళ్ళాలో చెప్పే ఓపిక లేక రహస్యం చెప్పినట్టు గుస గుసలుగా చెప్పాడు. ఆటో కదిలింది. అప్రయత్నంగా..బోర్డు వైపు చూసాడు కళ్ళు తుడుచుకుంటూ.

"ఏనుగులా రండి..పీనుగులా పొండి" మసగ్గా కనిపించింది.